క్లుప్తంగా

పీహెచ్‌సీలో అధికారుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

రాజాపూర్: ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో సిబ్బంది బిల్స్ చేయకుండా సీనియర్ అసిస్టెంట్ యశ్వంత్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అంతే కాకుండా వైద్య సిబ్బంది ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సైతం తమ ఇబ్బందులను విన్నవించుకోవడంతో ఎమ్మెల్యే, కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం జిల్లా ఉన్నతాధికారులు రమేష్‌తో పాటు రవీందర్‌గౌడ్ స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో విచారణ చేపట్టినట్లు సమాచారం. కలెక్టర్‌కు ఎమ్మెల్యే తెలిపిన వెంటనే సంబంధిత సీనియర్ అసిస్టెంట్ యశ్వంత్ పీహెచ్‌సీకి కొన్ని నెలలుగా రాని ఆయన నాలుగైదు రోజులుగా వచ్చి, సిబ్బంది పెండింగ్ బిల్స్ చేసినట్లు సమాచారం.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



భూత్పూర్: మండలంలోని కప్పెట వాగులో మంగళవారం అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామాల పర్యటనలో భాగంగా మంగళవారం సిబ్బందితో కలిసి కప్పెటకు వెళ్లగా.. వాగు నుంచి జేసీబీ సాయంతో ఇసుక తవ్వి నంబరు ప్లేట్‌లేని ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. జేసీబీ, ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌కు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని వెంకటేశ్వర్‌రెడ్డి, జేసీబీ డ్రైవర్ ఎం.డి.ఖాజాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండల కేంద్రంలోని కొత్తూర్ గ్రామ సమీపంలోని దుందుభి వాగు నుంచి అనుమతి లేకుండా మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి మల్లురవి పరామర్శ



జడ్చర్ల టౌన్: గొంతు సంబంధిత సమస్యలపై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా.మల్లురవి పరామర్శించినట్లు తెలియజేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటంతో పాటు వైద్యం అందిస్తున్న డాక్టర్ల బృందాన్ని కలుసుకుని చికిత్స విషయాలను తెలుసుకున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో వికసిత్ భారత్

గండేడ్: మండలంలోని కొండాపూర్, పంచాంగల్‌తండా గ్రామాల్లో మంగళవారం 'వికసిత్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్, ఉచిత రేషన్, పీఎం సురక్షాయోజన, ముద్రలోన్స్, పీఎం ఆయుష్మాన్ భారత్, తదితర పథకాలను ప్రజలకు వివరించారు. గిరమోని శ్రీను, ప్రభునాయక్, శంకర్‌నాయక్, కేశమ్మ, రాజునాయక్, రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్యను పెంచాలి



నర్వ: పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలని ప్రోగ్రాం అధికారి రాఘవేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పీహెచ్‌సీలో ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఇతర వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ ప్రోగ్రాంను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఎన్‌సీడీ సర్వే ఎప్పటికప్పుడు పూర్తిచేసేందుకు అందరు కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీలో ఓపీసేవలను సక్రమంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఇతర వైద్య సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డా.కృష్ణప్రియ, సీహెచ్‌ఓ ప్రభాకర్‌శెట్టి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివి లక్ష్యాన్ని సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ



రంగారెడ్డిగూడలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈఓ రవీందర్ తదితరులు

రాజాపూర్: త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో శ్రద్ధతో చదివి తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని రంగారెడ్డిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతిరోజూ తెల్లవారుజామున లేచి మనస్సుపెట్టి శ్రద్ధతో చదువుకోవాలన్నారు. మళ్లీ నెలరోజుల తర్వాత పాఠశాలను సందర్శిస్తానని అన్నారు. మెరుగైన ఫలితాలు తీసుకొస్తే మీకు మీ పాఠశాలకు పేరు వస్తుందని అన్నారు. అనంతరం 'లక్ష్య' కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రామిరెడ్డి, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పుష్పలత, లక్ష్మి, నాగయ్య, శంకర్‌రావ్, రవి, మధుసూదన్‌రెడ్డి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

జడ్చర్ల టౌన్: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని అందుకోసం ఎలాంటి మార్పులు తీసుకురావాలో చర్చించాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం జడ్చర్ల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నూతన పద్ధతుల్లో విద్యార్థులు అవగాహన పెంచుకునేలా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులను ఏబీసీ గ్రూపులుగా ఎలా విభజించారని అడిగి తెలుసుకున్నారు. అలాగే వచ్చే స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో నిర్ణయించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. స్కూల్‌కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ సయ్యద్‌మైనొద్దీన్‌తో పాటు ఆయా హైస్కూల్స్‌కు చెందిన ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూములపై విచారణ చేయాలి



మంత్రిని కలిసిన ఎమ్మెల్యే యెన్నం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రెటరేట్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చర్చించారు. ప్రభుత్వ భూములను గతంలో అధికారంలో ఉన్న నాయకులు మూకుమ్మడిగా దోచుకున్నారని, ఆక్రమణకు గురైన భూములపై విచారణ జరిపించాలని మంత్రిని కోరారు. ఎక్కడ భూములు కనిపించినా కబ్జా చేశారని, మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ భూమి అనేది కనిపించే పరిస్థితి లేకుండా చేశారని మంత్రికి తెలియజేశారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి, ఆక్రమించిన వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకొని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పంచాయతీ భవనాలకు శంకుస్థాపనలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: మండల పరిధిలోని గువ్వనికుంట, వెల్కిచెరువుతండాల్లో మంగళవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా మండలంలోని మొకర్లాబాద్, ముందలితండా, చిన్నాయపల్లి గ్రామాల్లో నిర్మించిన నూతన పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అర్హులకు అందాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని, అందులో భాగంగానే ప్రతి గ్రామంలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, శాంతిరంగ్యా, రాధారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసినా.. గెలిపించలేకపోయారు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: ఎన్నికల సమయంలో ఎంత చెప్పినా ప్రజలు వినిపించుకోలేదు.. వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, తమ కన్ను తామే పొడుచుకున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసినా.. తనను గెలిపించలేకపోయారని అన్నారు. ప్రభుత్వ చర్యలతో పాలమూరులో మళ్లీ వలసలు ప్రారంభమయ్యేలా ఉన్నాయని అన్నారు. పెళ్లికి తులం బంగారం ఇస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్నారని అన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే 1000 పడకల ఆస్పత్రి పనులు కూడా నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం 100 రోజుల సమయం ఇచ్చి, అమలు చేయకుంటే ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాగడానికి నీళ్లు లేని పరిస్థితి మహబూబ్‌నగర్‌లో ఉండేదని, శ్రీనివాస్‌గౌడ్ వచ్చిన తర్వాత ప్రతిరోజూ తాగు నీరు అందించారని తెలియజేశారు. సమావేశంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

పీయూలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో ప్రశంసా పత్రం అందజేస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు రోటరీ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ పేర్కొన్నారు. రక్తదానం ఇచ్చిన వారికి రూ.3 లక్షల ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, అహ్మద్‌షరీఫ్, వెంకట్‌రావు, అర్జున్‌కుమార్, చిన్నాదేవి పాల్గొన్నారు.

కొల్లూర్‌లో పల్లకీసేవ



పల్లకీసేవలో 1008వ జగద్గురువు

నవాబుపేట: మండల పరిధిలోని కొల్లూర్‌లో చింతలపూరి చిన్నియ్యస్వామి మఠంలో కొనసాగుతున్న రజతోత్సవాలకు మంగళవారం శ్రీరంభపురి జగద్గురువు శ్రీ1008వ గురువు డాక్టర్ వీరసోమేశ్వర రాజదేశికేంద్ర స్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించామని నిర్వాహకులు నందీశ్వర స్వామి తెలిపారు. ఈ సందర్భంగా కొల్లూర్‌లో జగద్గురువు పల్లకీసేవ నిర్వహించి ఊరేగించినట్లు తెలియజేశారు.

పర్యాటక కేంద్రంగా మైసమ్మ దేవాలయం



మైసమ్మ దేవాలయ ఉత్సవాల్లో పాల్గొని ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: మైసమ్మ దేవాలయాన్ని పర్యాటక కేంద్రాంగా చేస్తామని అలాగే దేవాలయానికి మరిన్ని నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అడవిలో అమ్మవారి దేవాలయ అవసరాలకు మరిన్ని నిధులు కేటాయించి, మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాంచంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు వాసు, రఘువీర్‌శర్మ, ఎంపీటీసీ నర్సింహ, భూపాల్‌రెడ్డి, నవాజ్‌రెడ్డి, ఆంజనేయులు, జగన్, కుమార్, రాజు, వెంకట్‌రెడ్డి, రవి, అశోక్, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వీసీకి వినతి అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. పీయూలో ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు నాయకులు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. విద్యార్థులకు అనారోగ్యం పాలైతే హాస్పిటల్‌కు వెళ్లేందుకు అంబులెన్స్ లేదని, హాస్టల్ గదుల్లో కిటికీలు బిగించాలని, లీకేజీల కారణంగా గదుల్లోకి నీరు చేరుతుందని, ప్రతిరోజూ తినే ఆహారం పూర్తిగా రుచి నాణ్యత ఉండటం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఏబీవీపీ నాయకులు అర్జున్, కృష్ణ, శ్రీధర్, ఆంజనేయులు, వేణుగోపాల్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల నిరసన

జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు నాయకులు మాట్లాడారు. హాస్టల్స్‌లో ఆన్‌లైన్ విధానం అడ్మిషన్లు తొలగించాలని, హాస్టల్స్‌లో పూర్తిస్థాయి మరుగుదొడ్లు నిర్మించాలని, మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, అరవింద్, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి

జడ్చర్ల: ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వసతిగృహాలకు, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. అద్దె భవనాల్లో సరైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సౌకర్యాలతో హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతి అందజేశారు. ఎస్‌ఐ చంద్రమోహన్ విద్యార్థులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు.



జడ్చర్లలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని వినతి



కలెక్టర్ రవినాయక్‌కు వినతి అందజేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం పర్దిపూరం గ్రామ పంచాయతీకి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవినాయక్‌కు వినతి అందజేశారు ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఎర్రన్న మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటివరకు పర్దిపురానికి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నాగరాజు, కుర్మన్న, వెంకటన్న, బాల్‌రాజు, రాములుతోపాటు పలువురు ఉన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలని ఆందోళన



అడ్డాకులలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఏర్పడిందని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 200 మంది విద్యార్థినులకు కేవలం రెండే మరుగుదొడ్లు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదని మంగళవారం భోజన విరామ సమయంలో పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. రెండు మరుగుదొడ్లతో నిత్యం పాఠశాలలో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులతో మాట్లాడి త్వరలోనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు తరగతులకు వెళ్లిపోయారు. అధికారులు స్పందించి మరుగుదొడ్ల సమస్య వెంటనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు.

వెన్నాచేడ్‌లో క్విజ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గండేడ్: మండల పరిధిలోని వెన్నాచెడ్‌లో మంగళవారం స్వామి వివేకానందుడి జయంత్యుత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా వెన్నాచెడ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మోడల్ స్కూల్‌తో పాటు, ప్రభుత్వ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు స్వామివివేకానంద యువజన సంఘం నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) విద్యార్థులు మొదటి బహుమతి సాధించగా, ద్వితీయ, తృతీయ బహుమతులను మోడల్ స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు కోడూర్ శివకృష్ణ, ఉపాధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్‌లో సంక్రాంతి సంబరాలు



పాఠశాలలో రంగవల్లులు వేస్తున్న మహిళలు

జడ్చర్ల టౌన్: మండలంలోని నాగసాల వద్ద ఉన్న స్వామినారాయణ్ గురుకుల్ అంతర్జాతీయ పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రతినిధి సర్వదర్శన్ స్వామి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులు రంగవల్లులు తీర్చిదిద్దారు. సంక్రాంతి పర్వదినం విశిష్టతను ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. మన ఆచార వ్యవహారాలు మర్చిపోకుండా ఉండేందుకు భావితరాలకు మన సంస్కృతిని అందజేయటమే లక్ష్యంగా సంబరాలు నిర్వహించినట్లు కో-ఆర్డినేటర్లు రాఘవాదిత్య, సాయిలక్ష్మి వెల్లడించారు. అనంతరం గోపూజ చేసి భోగిమంటలు వేయించారు. విద్యార్థులతో గాలిపటాలు ఎగురవేయించారు.

ముగిసిన అబ్దుల్ ఖాదర్‌షా ఉర్సు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై 85వ ఉర్సు వేడుకలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖత్మె ఖురాన్ పఠించారు. అనంతరం జ్యారత్ ఫాతేహా నిర్వహించారు. ఉర్సు వేడుకల్లో ఆనవాయితీ ప్రకారం జొన్న రొట్టెలు, పాలకూర ఉంచి ఫాతేహా నిర్వహించారు. ఉర్సు వేడుకలు ముగిసినప్పటికీ మరికొన్ని రోజుల వరకు దర్గాలో భక్తులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఉర్సు సందర్భంగా దర్గా ఆవరణలో వివిధ దుకాణాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఈ దుకాణాల్లో కొనుగోలు దారులతో సందడి నెలకొంది. ఫాతేహా కార్యక్రమంలో దర్గా ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రి, ఇతర మతపెద్దలు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం విద్యుత్ సమస్య పరిష్కరిస్తాం



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీ అనంతయ్య, జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్మించిన ఇండోర్ స్టేడియానికి కరెంట్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్- కో ఏడీ అనంతయ్య అన్నారు. ఇండోర్ స్టేడియానికి అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సమస్యను జిల్లా క్రీడా శాఖఅధికారి శ్రీనివాస్ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అందులో భాగంగా మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఏడీ అనంతయ్య స్థలాన్ని పరిశీలించారు. ఇండోర్‌కు అవసరమైన విద్యుత్ లైన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదలను సిద్ధం చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్‌ఎన్‌టీడబ్ల్యూఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్త కలెక్టరేట్‌లో మంగళవారం రాజునాయక్ తండా వెల్ఫేర్ అసోసియేషన్(ఆర్‌ఎన్‌టీడబ్ల్యూఏ)కు చెందిన నూతన సంవత్సర క్యాలండర్‌ను కలెక్టర్ జి.రవినాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ శేషగిరిచంద్, అధ్యక్షుడు కె.ప్రకాశ్, ఉపాధ్యక్షుడు జయరాం, ప్రధాన కార్యదర్శి వి.రవీందర్ నాయక్, కోశాధికారి ఆర్.నారాయణ, గౌరవఅధ్యక్షుడు థానాజిచౌహాన్, దశరథ్‌నాయక్, సభ్యులు సోమ్‌నాథ్, పవన్, దాసు, తౌర్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్ ..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీ కార్యదర్శుల నూతన క్యాలెండర్‌ను మంగళవారం సచివాలయంలో ఆమె ఆవిష్కరించారు. పెండింగ్‌లోని పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకులంగా ఉందన్నారు. మధుసూదన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.